సాక్షి కుమురం భీం

గురువారం । 1 । ఆగస్టు । 2024



అమ్మపాలు.. అమృతం

ప్రభుత్వం ఏటా ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తోంది. తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తోంది. 8లో▸

శ్రావణమాసంలో పండుగలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: శ్రావణమాసంలో పండుగల తేదీలను నిర్ణయించినట్లు దూపదీప నైవేద్యం అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ తెలిపారు. ఆగస్టు 5 నుంచి శ్రావణమాసం ప్రారంభమవుతుండగా.. 9న నాగుల పంచమి, 16న వరలక్ష్మీ వ్రతం, 19న రాఖీ పౌర్ణమి, సెప్టెంబర్‌ 2న సోమవారం పొలాల అమావాస్య జరుపుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
29.0 /25.0

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. రుతపవనాల ప్రభావంతో పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

రిటైర్డ్‌ పోలీసు అధికారికి జైలు

- 2013లో ఏసీబీకి పట్టుబడ్డ వైనం
- ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20వేల జరిమానా



రిటైర్డ్‌ సీఐ చింతల లచ్చన్న

ఆదిలాబాద్‌టౌన్‌: ఓ కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచే విషయంలో లంచం ఇవ్వాలని డిమాండ్‌ చేసి ఏసీబీకి పట్టుబడ్డ రిటైర్డ్‌ సీఐ చింతల లచ్చన్నకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ కరీంనగర్‌ ఏసీబీ స్పెషల్‌ కోర్టు జడ్జి వివేక్‌ తీర్పు నిచ్చారు. ఏసీబీ కోర్టు పీపీ కిశోర్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌ ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు ప్రస్తుతం కుమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లా వాంకిడి పోలీసు స్టేషన్‌లో సీఐగా పనిచేసిన చింతల లచ్చన్న ఓ కేసులో నిందితుడిని అరెస్టు చేయగా, ఆయన తల్లి ఉప్పుల శికళ నుంచి 2013వ సంవత్సరంలో లంచం డిమాండ్‌ చేశారు. ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అప్పటి ఏసీబీ డీఎస్పీ టి.సుదర్శన్‌ గౌడ్‌ ఆధ్వర్యంలో ట్రాప్‌ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ సీఐ రమణమూర్తి కోర్టులో చార్జ్‌షీట్‌ దాఖలు చేయగా, కోర్టు ప్రత్యేక సాక్షులను విచారించింది. వాంగ్మూలాన్ని సేకరించింది. ఆధారాలను పరిశీలించిన అనంతరం ఆయనకు బుధవారం ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చినట్లు వివరించారు.

పోషకాహారం అందించేందుకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్‌: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి, జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్‌తో కలిసి పౌష్టికాహారం, మందుల పంపిణీపై యూనిసెఫ్‌ ప్రతినిధులు, పోషణ్‌ అభియాన్‌, ఆహార విభాగం సమన్వయకర్తలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి సకాలంలో ఆహారం, అవసరమైన మందులు అందిస్తున్నామన్నారు. వారిని సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లోని పీవీటీజీ చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో యూనిసెఫ్‌ ప్రతినిధులు ఖ్యాతి తివారి, రేషాదేశాయ్‌, నరసింహారావు పాల్గొన్నారు.

30 పోలీసు యాక్ట్‌ అమలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లావ్యాప్తంగా నేటి నుంచి ఈ నెల 31 వరకు 30 పోలీసు యాక్ట్‌ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ 30 పోలీసు యాక్ట్‌ 1861 అమలులో ఉన్నందున పోలీసు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పబ్లిక్‌ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించొద్దన్నారు. లౌడ్‌ స్పీకర్లు, డీజేలు కూడా నిషేధమని పేర్కొన్నారు.


బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్‌: విద్యార్థిని మృతికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రేకు వినతిపత్రం అందించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థిని కుమురం లక్ష్మి పదిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నా మెరుగైన వైద్యం అందించలేదని ఆరోపించారు. తల్లిదండ్రులకు కూడా సకాలంలో సమాచారం అందించలేదన్నారు. ప్రిన్సిపాల్‌తోపాటు ఏఎన్‌ఎంలపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.20లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్‌, కేవీపీఎస్‌ జిల్లా కార్యదర్శి దినకర్‌, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌ పాల్గొన్నారు.

గతుకుల హైవే

‘బీఓటీ రోడ్లు చాలా పరిపూర్ణంగా (లోపం లేని విధంగా) ఉంటాయి. వాటి గురించి పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదు..’ గతేడాది సెప్టెంబర్‌ నెలాఖరున కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌ గడ్కరీ జాతీయ రహదారుల గురించి చెప్పిన మాటలు ఇవి... కానీ కేంద్ర మంత్రి మాటలకు భిన్నంగా కుమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లాలో నిర్మించిన నాలుగు లేన్ల హైవే నిర్మాణం ఉంది. ఏడాదికే రహదారి గుంతలమయంగా మారి నాసిరకం పనులకు అద్దం పడుతోంది.

- అధ్వానంగా మారిన జాతీయ రహదారి- 363
- నిత్యం నరకం చూస్తున్న వాహనదారులు
- తేలికపాటి వర్షాలకే గుంతలమయం
- పనుల నాణ్యతపై విమర్శల వెల్లువ



ఈదులవాడ వద్ద అధ్వానంగా జాతీయ రహదారి



బూర్గుడ వద్ద ఫ్లైఓవర్‌పై గుంతలు

సాక్షి, ఆసిఫాబాద్‌: రెబ్బెన మండలం రేపల్లేవాడ నుంచి మహారాష్ట్రలోని చంద్రాపూర్‌ సరిహద్దు వరకు 50 కిలోమీటర్ల మేర ఉన్న 363 జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో డొల్లతనం బయటపడుతోంది. చిన్నపాటి వర్షాలకే జాతీయ రహదారి గుంతలమయంగా మారింది. నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోవడంతోనే ఇలాంటి దుస్థితి ఏర్పడిందని ఇంజనీరింగ్‌ నిపుణులు పేర్కొంటున్నారు. గతుకుల రోడ్లపై ప్రయాణం.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవడమే అన్న అభిప్రాయం వాహనాదారుల నుంచి వ్యక్తమవుతోంది.

రోడ్డు టెర్రర్‌..

రహదారులపై ప్రయాణించేవారు క్షేమంగా ఇంటికి చేరుకోవాలనుకుంటారు. కానీ నేషనల్‌ హైవే 363పై ఇప్పటికే అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. రహదారి నిర్మాణంలో ఇంజనీరింగ్‌ లోపం ఉండటంతోనే ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. రహదారిపై ‘రోడ్డు క్రాసింగ్‌’లు ఎక్కడ ఉండాలో? ఎక్కడ ఉండకూడదో? అన్న దానిపై ఇంజనీరింగ్‌ అధికారులు, కాంట్రాక్టర్‌కు స్పష్టత లేకపోవడంతో ఇష్టానుసారం రోడ్డు క్రాసింగ్‌లు ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాద ఘటనల నేపథ్యంలో నిద్ర మేల్కొన్న అధికారులు తప్పులు సరిచేయడం గమనార్హం. రేపల్లేవాడ నుంచి చంద్రాపూర్‌ సరిహద్దు వరకు చేపట్టిన ఈ పనులను ‘బిల్డ్‌, ఆపరేట్‌ అండ్‌ ట్రాన్స్‌ఫర్‌(బీఓటీ) దిలీప్‌ బిల్డ్‌కాన్‌ అనే కాంట్రాక్ట్‌ సంస్థ దక్కించుకుంది. రూ.1,642 కోట్ల వ్యయంతో రెండు ఏకో బ్రిడ్జిలు, రెబ్బెన, ఆసిఫాబాద్‌, వాంకిడిలోని మూడు ప్రధాన వంతెనలతోపాటు మరో పది వరకు విలేజ్‌ అండర్‌ పాస్‌లు నిర్మించారు. కాంట్రాక్ట్‌ సంస్థ పనుల్లో నాణ్యత పాటించకపోవడం.. ప్రమాణాలు పర్యవేక్షించాల్సిన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పట్టించుకోకపోవడంతో రెబ్బెన నుంచి గోయిగాం వరకు పలుచోట్ల జాతీయ రహదారి గుంతమయంగా మారింది.

గుంతలు గుర్తించాం

రేపల్లేవాడ- చంద్రాపూర్‌ 363 జాతీయ రహదారిపై గుంతలు గుర్తించాం. రహదారి పనులు పూర్తయ్యాక, మొదటిసారి వర్షాలు కురిశాయి. 20 రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారిపై గుంతలు ఏర్పడిన మాట వాస్తవమే. రెబ్బెన నుంచి బొంబార వరకు గుంతలు ఏర్పడ్డాయి. వాటిని యుద్ధప్రాతిపదికన పూడ్చుతున్నాం. ఈ రోజు రెబ్బెన ఫ్లైఓవర్‌పై ఉన్న గుంతలను కోల్డ్‌మిక్స్‌తో పూడ్చివేశాం. మిగిలిన చోట్లా పనులు కొనసాగుతాయి. పునాదు(బేస్‌)లు పటిష్టంగా ఏర్పాటు చేయకపోవడం.. నాణ్యత లేని మట్టిని రహదారి పనుల్లో నిర్మించడం వల్ల ఇలాంటి లోపాలు తలెత్తుతాయి. అయితే వీటికి శాశ్వత పరిష్కారం చూపుతాం.

– రంజన్‌కుమార్‌, ప్రాజెక్టు మేనేజర్‌, ఎన్‌హెచ్‌ఏఐ

టోల్‌ బాదుడే..!

బీఓటీ పద్ధతిన పనులు దక్కించుకున్న డీబీఎల్‌ సంస్థ పదిహేను సంవత్సరాల పాటు రోడ్డు నిర్వహణ బాధ్యత చూసుకోవాలి. దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టాలి. సదరు కాంట్రాక్ట్‌ సంస్థ రహదారి పనులు అసంపూర్తిగా ఉన్న సమయంలోనే వాంకిడి వద్ద టోల్‌ ఏర్పాటు వాహనాల నుంచి ట్యాక్స్‌ వసూలు చేయడం ప్రారంభించింది. హైవేపై గుంతల విషయమై డీబీఎల్‌ సంస్థ లైజనింగ్‌ ఆఫీసర్‌ వి.రవికుమార్‌ను ‘సాక్షి’ ఫోన్‌లో సంప్రదించగా ‘ప్రపంచంలో ఎక్కడా సమస్య లేనట్లుగా.. మీకు రేపల్లేవాడ- చంద్రాపూర్‌ జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలే కనిపిస్తున్నాయి? పాత్‌హోల్స్‌ (గుంతలు) పూడ్చేందుకు ప్రత్యేక టీంలు ఉన్నాయి. ఆ గుంతలను వారు పూడ్చుతారు.’ అంటూ సమాధానం ఇవ్వడం కొసమెరుపు.

అధ్వానం.. అంతర్రాష్ట్ర రహదారులు



వెంకట్రావ్‌పేట్‌, పోడ్సా అంతర్రాష్ట్ర రహదారిపై భారీ గుంతలు

- నిబంధనలకు విరుద్ధంగా ఓవర్‌ లోడ్‌తో వాహనాల రాకపోకలు
- భారీ గుంతలతో ప్రమాదకరంగా రోడ్లు
- భారీ వాహనాలను అడ్డుకుంటున్న సమీప గ్రామాల ప్రజలు

సిర్పూర్‌(టి): ఓవర్‌లోడ్‌ వాహనాలతో అంతర్రాష్ట్ర రహదారులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. సిర్పూర్‌(టి) మండలం మీదుగా వెళ్తున్న వెంకట్రావ్‌పేట్‌- పోడ్సా అంతర్రాష్ట్ర రహదారితోపాటు సిర్పూర్‌(టి)– మాకిడి, చింతలమానెపల్లి మండలం మీదుగా వెళ్తున్న గూడెం- అహేరి అంతర్రాష్ట్ర రహదారులపై రాత్రిపగలు తేడా లేకుండా భారీ వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఎలాంటి అనుమతి పత్రాలు లేకున్నా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌, మధ్యప్రదేశ్‌ రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌ వైపు లోడ్‌తో వెళ్తున్నాయి. సిర్పూర్‌(టి), కౌటాల ప్రధాన రహదారి నుంచి అంతర్రాష్ట్ర వంతెన వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసం కాగా.. మాకిడి చౌరస్తా నుంచి హుడ్కిలి గ్రామం వరకు తీవ్రంగా దెబ్బతింది. సిర్పూర్‌(టి), కౌటాల, కాగజ్‌నగర్‌ ప్రధాన రహదారులు కూడా పూర్తిగా ధ్వంసం కావడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

పట్టించుకోని అధికార యంత్రాంగం

సిర్పూర్‌ నియోజకవర్గంలో మూడు అంతర్రాష్ట్ర రహదారుల మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా జిల్లా పోలీసు, ఆర్టీఏ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ద్విచక్ర వాహనదారులు, కార్లలో వెళ్లేవారు ప్రయాణానికి ఇబ్బంది పడుతున్నా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆయా అంతర్రాష్ట్ర రహదారుల్లో ఎలాంటి చెక్‌పోస్టులు లేకపోవడంతో అధికారులు కూడా తనిఖీలు చేపట్టడం లేదు. ఈ దారుల గుండానే అక్రమంగా బియ్యం దందా సాగిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. కాగా.. వెంకట్రావ్‌పేట్‌ గ్రామం వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని వెంకట్రావ్‌పేట్‌, పోడ్సా అంతర్రాష్ట్ర రహదారిపై మంగళవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. భారీ వాహనాలను అడ్డుకున్నారు. ఇష్టారాజ్యంగా పరిమితికి మించి ఓవర్‌లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బైక్‌లు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సిర్పూర్‌(టి) ఎస్సై రమేశ్‌ ఘటనాస్థలికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పి వాహనాలను పంపించారు. దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

తనిఖీలు లేవు



అంతర్రాష్ట్ర రహదారుల్లో ఎలాంటి తనిఖీలు చేపట్టడం లేదు. ఇష్టారాజ్యంగా తిరుగుతున్న భారీ వాహనాలు, పరిమితికి మించి లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం సరికాదు.

– దివాకర్‌, వెంకట్రావ్‌పేట్‌

నిబంధనల మేరకు చర్యలు

అంతర్రాష్ట్ర రహదారులపై పరిమితికి మించి లోడ్‌తో వాహనాలు రాకపోకలు సాగిస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం. ఆర్టీఏ అధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీలు చేపడతాం.

– కరుణాకర్‌, కాగజ్‌నగర్‌ డీఎస్పీ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే



మొక్క నాటుతున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే, పక్కన ఎస్పీ శ్రీనివాసరావు, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: భావితరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో బుధవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్‌, అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారితో కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్‌ మాట్లాడుతూ పోలీసు కార్యాలయంలో సుమారు 500 మొక్కలు నాటినట్లు తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 60శాతం లక్ష్యం చేరుకున్నామని పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవం లక్ష్యాలు వందశాతం సాధించేందుకు పోలీసుశాఖ సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో అనువైన స్థలాలు గుర్తించి మొక్కలు నాటాలని ఆదేశించినట్లు తెలిపారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందుకు సాగని రిజిస్ట్రేషన్లు

- సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో దరఖాస్తుదారుల నిరీక్షణ



కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. జూలై 27 నుంచి కార్యాలయంలో బ్యాటరీ చెడిపోవడం, ఇతర సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఇన్వర్టర్‌ బ్యాటరీ చెడిపోగా.. నెలరోజులుగా స్టాంపు కౌంటర్‌ కంప్యూటర్‌ పని చేయడం లేదని సిబ్బంది తెలిపారు. సంబంధిత ఏజెన్సీలు మరమ్మతులు చేపట్టకపోవడంతో కార్యాలయానికి వచ్చే క్రయవిక్రయ దారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మంగళవారం నాటికి కార్యాలయంలో 20 డాక్యుమెంట్లు పెండింగ్‌లో ఉన్నాయి. బుధవారం సైతం కొంతమంది కార్యాలయానికి వచ్చి వెనుదిరిగారు. జిల్లాకు చెందిన వారితోపాటు కరీంనగర్‌, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాకు చెందిన వారు రిజిస్ట్రేషన్ల కోసం వచ్చారు. అధికారులు స్పందించి రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కనీస సామర్థ్యాలు పెంచాలి



మాట్లాడుతున్న డీఈవో అశోక్‌

ఆసిఫాబాద్‌రూరల్‌: విద్యార్థుల్లో కనీస విద్యా సామర్థ్యాలు పెంచాలని డీఈవో అశోక్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం కాంప్లెక్స్‌ ఉపాధ్యాయులకు నేషనల్‌ అచీవ్‌మెంట్‌ సర్వే(న్యాస్‌) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు ముందుగానే పాఠ్య ప్రణాళికలు, బోధన అభ్యసన సామగ్రి రూపొందించుకుని బోధన చేయాలన్నారు. నవంబర్‌లో నిర్వహించే న్యాస్‌ సర్వేలో జిల్లాను ముందుంచాలన్నారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, హెచ్‌ఎం సుభాష్‌, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలను ప్రోత్సహించాలి

విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించాలని డీఈవో అశోక్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్‌ ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్‌ ఓరియెంటేషన్‌ కార్యక్రమం నిర్వహించారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఇన్‌స్పైర్‌ నామినేషన్లు పూర్తి చేయాలన్నారు. ప్రతీ స్కూల్‌లో ఐడియా బాక్స్‌ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు తమ చుట్టూ ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కార సాధనకు ప్రాజెక్టులు రూపొందించేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం జిల్లా సైన్స్‌ అధికారి మధుకర్‌ ఇన్‌స్పైర్‌ నామినేషన్ల ప్రక్రియపై సైన్స్‌ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.



‘మాది ఆసిఫాబాద్‌ మండలం మోవాడ్‌ గ్రామ పంచాయతీ పరిధిలోని చౌపన్‌గూడ. గ్రామంలో నా భార్య జారుబాయి పేరుతో మూడెకరాల పట్టా భూమి ఉంది. రూ.80 వేల పైచిలుకు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రుణం తీసుకున్నాం. రుణమాఫీ రెండు జాబితాల్లో మా పేరు లేదు..’ అంటూ ఆదివాసీ రైతు కొర్కెట బొజ్జు ఆవేదన వ్యక్తం చేశాడు. మాకు కూడా రుణమాఫీ వర్తింపజేయాలని వేడుకుంటున్నాడు.



ఆసిఫాబాద్‌ మండలం చౌపన్‌గూడ గ్రామానికి చెందిన చహకటి జగన్నాథం మూడెకరాల పట్టా భూమికి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.1.30 లక్షల వ్యవసాయ రుణం తీసుకున్నాడు. ప్రభుత్వం విడుదల చేసిన రెండు జాబితాలో అతడి పేరు లేదు. దీంతో కంగారుపడి బుధవారం జిల్లా కేంద్రంలోని టీజీబీకి వచ్చి బ్యాంకు అధికారులను ఆరా తీయగా.. సరైన సమాధానం చెప్పలేదు.

రుణమాఫీ దిగులు

- జాబితాలో పేర్లు లేవని పలువురు రైతుల ఆందోళన
- బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వైనం..
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌ రూం ఏర్పాటు
- వ్యవసాయశాఖ అధికారులకు వివరాలు అందించాలని సూచన



బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రైతుల రద్దీ

ఆసిఫాబాద్‌: రైతు రుణమాఫీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల జాబితాను ప్రకటించింది. మాఫీ అయిన వారు సంతోషం వ్యక్తం చేస్తుండగా.. వివిధ కారణాలతో జాబితాలు పేర్లు లేని వారు దిగాలు చెందుతున్నారు. కొందరికేనా రుణమాఫీ అంటూ ప్రశ్నిస్తున్నారు. కారణాలు తెలుసుకునేందుకు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తున్నారు. మరికొందరు బ్యాంకుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు.

పథకం అమలు ఇలా..

కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తోంది. ఈ నెల 17న సీఎం రేవంత్‌రెడ్డి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించగా.. జిల్లాలో కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే ప్రారంభించారు. తొలివిడతలో భాగంగా రూ.లక్షలోపు రుణాలు మాఫీ చేయగా.. జూలై 30 నుంచి రూ.లక్షన్నర లోపు రుణాల నగదును రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. 2008 డిసెంబర్‌ 12 నుంచి 2023 డిసెంబర్‌ 9 వరకు కటాఫ్‌ తేదీగా నిర్ణయించిన విషయం తెలిసిందే. జిల్లాలో 1.38 లక్షల మంది రైతులు ఉండగా సుమారు 1.19 లక్షల మంది ఎస్‌బీఐ, టీజీబీ, ఇతర సహకార బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. మొదటి విడతలో భాగంగా 22 వేల మంది రైతుల ఖాతాల్లో రూ.125.20 కోట్లు, రెండో విడతలో 14,623 మంది ఖాతాల్లో రూ.153.34 కోట్లు జమ చేశారు. ఇప్పటివరకు రెండు విడతల్లో రూ.278,54,14,379 నగదు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

కారణాలు అనేకం..

రుణమాఫీకి తొలుత రేషన్‌కార్డు ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా ఆ తర్వాత రేషన్‌కార్డు లేనివారికి కూడా మాఫీ చేస్తామని స్పష్టతనిచ్చారు. రుణమాఫీకి సంబంధించిన రెండు జాబితాలు ఇప్పటికే విడుదల కావడంతో జిల్లాలోని రైతులు బ్యాంకుల వద్ద క్యూకడుతున్నారు. జాబితాలో పేర్లు లేని వారు ఆందోళనకు గురవుతున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు వద్దకు అనేక మంది రైతులు చేరుకుని బ్యాంకు అధికారులకు సమస్యను విన్నవించారు. మరోవైపు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని వివరాలు సక్రమంగా ఉన్న వారి పేర్లు మాత్రమే జాబితాలో ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రేషన్‌కార్డులు లేని వారు, వివాహమై ఇంటి పేరు మార్పు, ఇతర సాంకేతిక కారణాలతోనూ పలువురి పేర్లు జాబితాలో లేనట్లు తెలుస్తోంది. దశలవారీగా అర్హులకు మాఫీ వర్తింపజేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్‌ నంబర్‌ 87332 79033 ఏర్పాటు చేశారు.

వ్యవసాయాధికారులను సంప్రదించాలి

రైతు రుణమాఫీకి సంబంధించి విడుదలైన రెండు జాబితాల్లో పేర్లు లేని వారు ఆయా మండలాల్లోని మండల వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. రుణమాఫీపై ఎలాంటి అపోహలు, ఆందోళన వద్దు. సాంకేతిక కారణాలతో జాప్యం జరుగుతోంది. రేషన్‌ కార్డు ఉన్నా.. లేకున్నా రుణమాఫీ నగదు జమవుతాయి.

– రావూరి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన సామగ్రి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని రవిచంద్ర కాలనీలో షార్ట్ సర్క్యూట్‌తో కొండం చిన్నక్కకు చెందిన ఇల్లు దగ్ధమైంది. బుధవారం చిన్నక్క కొడుకు, కోడలు ఆదిలాబాద్‌కు వెళ్లగా.. మధ్యాహ్నం చిన్నక్క పక్కింటికి వెళ్లింది. అదే సమయంలో ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అప్పటికే సామగ్రితోపాటు బీరువా, టీవీ, ఫ్రిజ్, రూ.1.5 లక్షల నగదు, 1.5 తులాల బంగారు నగలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది కార్తీక్, సంతోష్, విలాస్, శివకుమార్, విఠల్, తులసీదాస్ ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. బాధిత కుటుంబానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్ నిత్యావసర సరుకులు అందించారు.

ఐదుగురు బైండోవర్

జన్నారం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురు వ్యక్తులను బెల్లం, పటిక అమ్మకం, గుడుంబా తయారీ కేసుల్లో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎదుట బుధవారం బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ లక్సెట్టిపేట సీఐ నర్సింహులు తెలిపారు. ఇటీవల కాలంలో పటిక, బెల్లం, గుడుంబాతో పట్టుబడగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వట్టెం కిష్టయ్య, బానవత్ తుకారాం, బండారు లక్ష్మీనారాయణ, గొల్లె అమృత, దేవనవేని హన్మంతులను ఇంచార్జీ ఎక్సైజ్ ఎస్సై శంకర్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారని తెలిపారు.

ఆలయంలో దొంగతనం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గోదావరి నదీ తీరాన ఉన్న గంగమ్మ ఆలయంలో దొంగతనం జరిగినట్లు స్థానిక ఎస్సై సతీష్ తెలిపారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు గుడి తాళం పగులగొట్టి అమ్మవారి మెడలో ఉన్న బంగారు పుస్తెలు, రాగి చెంబు, ప్లేటు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.16,100 ఉంటుందని తెలిపారు. క్లూస్ టీం సిబ్బంది ఫింగర్ ప్రింట్లు సేకరించారని తెలిపారు. గుడి నిర్వాహకులు మేడి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

యువతి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసముంటున్న గైక్వాడ్ రేఖ (27) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. రేఖ ఆమె సోదరి దీక్షతో కలిసి ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇంటి పనుల విషయంలో మూడు రోజుల క్రితం ఇద్దరి మధ్య మాటలు లేవు. మనస్తాపం చెందిన ఆమె ఉదయం ఉరేసుకుంది. వెంటనే 108కు సమాచారం అందించగా సిబ్బంది చేరుకొని పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

అమ్మపాలు.. అమృతం

- తాగితే బిడ్డకు.. తాగిస్తే తల్లికి రక్ష
- నేటి నుంచి ఈ నెల 7వరకు తల్లిపాల వారోత్సవాలు



తల్లి పాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్(ఫైల్)

మంచిర్యాలటౌన్: తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇంట్లో సంతోషం వెల్లివిరుస్తుంది. వారి ఆరోగ్యం కోసం ప్రభుత్వమూ ఎన్నో పథకాలు అమలు చేస్తోంది. ప్రతియేటా ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి, తల్లి పాల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బిడ్డకు తల్లిపాలు వరం, సురక్షితం, పుష్టికర ఆహారం.. అన్ని పోషకాలు అందించి రోగాల నుంచి రక్షించగలిగే అమృతమని వైద్యులు సూచిస్తున్నారు. పోతపాల కంటే తల్లిపాలు తాగే పిల్లలు బలంగా, తెలివిగా ఉంటారనేది నిరూపితమైన వాస్తవం. శిశువు సంపూర్ణ ఆరోగ్యం, వజ్ర సమానమైన రోగ నిరోధక శక్తిని పొందాలంటే తల్లిపాలు పట్టించాల్సిందే. పుట్టిన బిడ్డకు పాలు తాగిస్తే తల్లికీ లాభాలున్నాయి. ఎన్నో రకాల వ్యాధులు రాకుండా ఉంటాయి. ఇంతటి విశిష్టత కలిగిన తల్లిపాలను బిడ్డ ఎంత వయస్సు వచ్చే వరకు ఇవ్వాలి, రోజుకు ఎన్నిసార్లు పట్టాలి, ఎలా పట్టాలి, తల్లిపాలు పుష్కలంగా రావాలంటే ఏం తినాలి, ముర్రుపాలు ఎప్పుడు పట్టాలి... ఇలా చాలా అంశాలపై అందరికీ అవగాహన ఉండదు. ఆధునిక కాలం అమ్మలకు మరింత తక్కువ. ఇలాంటి అంశాలను వారికి తెలియజేస్తూ, తల్లిపాల ప్రాముఖ్యతను చాటేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటి నుంచి 7వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నారు.

ఆరు నెలల వరకు..

బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు తల్లులకు వచ్చే ముర్రుపాలను కచ్చితంగా శిశువుకు పట్టాలి. దీనివల్ల రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందుతాయి. ఇందులో మాంసకృత్తులు, విటమిన్ 'ఏ' ఉంటుంది. బిడ్డ పుట్టిన గంట నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరే పదార్థాలూ ఇవ్వకూడదు. తల్లి పాలు తేలికగా అరుగుతాయి. శుభ్రంగా, ఎటువంటి క్రిములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. రోజులో బిడ్డకు 8నుంచి 10 సార్లు పాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లిపాలతోపాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి. దీనివల్ల ఎలాంటి వ్యాధులూ దరిచేరకుండా బిడ్డ ఎదుగుదల సక్రమంగా ఉంటుంది. తల్లిపాలు పుష్కలంగా రావాలంటే గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం, పాలు, చేపలు, గుడ్లు, తాజా కూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి.

జిల్లాల వారీగా వివరాలు

	మంచిర్యాల	ఆదిలాబాద్	నిర్మల్	కుమురంభీం ఆసిఫాబాద్
అంగన్‌వాడీకేంద్రాలు	969	1256	976	973
బాలింతలు	3,902	5000	4073	3,939
గర్భిణులు	4,343	5000	6354	4,940
చిన్నారులు	31,144	22000	62744	48,004

బిడ్డకు ప్రయోజనం

తల్లిపాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి. నాణ్యమైన ప్రోటీన్లు, ఒమెగా 3, 6 అలాగే 9 బిడ్డ మెదడుకు వికాసానికి తోడ్పడుతాయి. పాలలో విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులోని లాక్టోజ్ వల్ల కాల్షియం నిల్వలు పెరుగుతాయి. బిడ్డను రక్తహీనత నుంచి కాపాడుతాయి. తొలి నెలలో శిశువులకు వివిధ రకాల అంటువ్యాధుల బారి నుంచి కాపాడుతాయి. మృదువైన మలవిసర్జన, మలబద్ధకం సమస్య నివారణకు తోడ్పడుతాయి. జీర్ణ మండలాన్ని వృద్ధి చేస్తాయి. తల్లిపాల ద్వారా బిడ్డలకు డయేరియా, న్యూమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు. క్యాన్సర్, చెవికి సంబంధించిన వ్యాధులు, గుండె జబ్బులు వంటి వ్యాధుల బారి నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి. ఎలర్జీ, ఆస్తమా, డయాబెటీస్ వంటి వ్యాధులు రావు. బాల్యం, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ.

తల్లికి కలిగే లాభాలు..

తల్లులు చనుబాలు ఇవ్వడం వల్ల గర్భధారణ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గడంతోపాటు త్వరగా కోలుకుంటారు. జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు. చనుబాలు ఇచ్చినందువల్ల ఊబకాయం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. గర్భానికి పూర్వం ఉన్న బరువును తిరిగి పొందగలుగుతారు. బిడ్డకు పాలు పట్టించడం వల్ల రొమ్ము, గర్భ సంచి క్యాన్సర్లు రావు. తల్లులకు మలి వయసులో వచ్చే ఆస్టియో పొరోసిస్(ఎముకల బలహీనత) నుంచి కాపాడుతుంది. తల్లి శిశువుల మధ్య బంధాన్ని పెంపొందిస్తుంది. తల్లికి, శిశువుకు జ్వరం వచ్చినప్పుడు, టీ కాలు ఇచ్చినప్పుడు కూడా పాలు పట్టించవచ్చు.

ఏటా వారోత్సవాలు



ప్రతియేటా తల్లి పాల వారోత్సవాలను ఆగస్టు మొదటి వారంలో నిర్వహించడం జరుగుతుంది. అమ్మ పాల విశిష్టతను తెలిపేలా అవగాహన సమావేశాలు నిర్వహిస్తాం. గర్భిణులు, బాలింతలు తల్లి పాల విశిష్టతను తప్పకుండా తెలుసుకోవాలి. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరగడం, ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది. పుట్టిన నాటి నుంచే బిడ్డలకు తల్లిపాలనే అందించాలి.

– ఉమాదేవి, జిల్లా ఇన్‌చార్జి సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

వాహనాన్ని అజాగ్రత్తగా నడిపిన వ్యక్తికి జరిమానా

మంచిర్యాలక్రైం: ద్విచక్రవాహనాన్ని అజాగ్రత్తగా, అతివేగంగా నడిపి ఓ వ్యక్తిని గాయాలపాలు చేసిన వ్యక్తికి రూ.వెయ్యి జరిమానా విధించడంతోపాటు రూ.7వేలు నష్టపరిహారం చెల్లించాలని మంచిర్యాల రెండో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి నిరోష బుధవారం తీర్పునిచ్చారు. 2021 డిసెంబర్ 15న మంచిర్యాలలో అభిరామ్ స్కూల్ నుంచి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో పి.సాయికుమార్ ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. అభిరామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడి తండ్రి చిందం అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి అప్పటి ఎస్సై ప్రవీణ్‌కుమార్ నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్ సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి జరిమానా విధించడంతోపాటు బాధితుడికి పరిహారం చెల్లించాలని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ రాగితీగ చోరీ



పగులగొట్టిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల గ్రామ సమీపంలోని వాగు ఒడ్డున పొలాలకు నీరందించేందుకు బోరు బావి వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రాగి తీగ చోరీకి గురైంది. శెగ్యం మల్లయ్య, భైరి రామాగౌడ్‌లకు పంట పొలాలకు నీరందించేందుకు గాను బోరుబావికి విద్యుత్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి తీగను మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు తెలిపారు. సంబంధిత అధికారులు పట్టించుకొని చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

'గుర్తింపు' లేక ఎక్కడి సమస్యలు అక్కడే..

- ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు సీతారామయ్య



కాసిపేట 2గనిపై మాట్లాడుతున్న సీతారామయ్య

కాసిపేట: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఏడు నెలలు గడుస్తున్నా గుర్తింపు సంఘం పత్రం ఇవ్వకపోవడంతో కార్మికుల సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు, వేజ్‌బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ గుర్తింపు పత్రం ఇస్తే ఏరియా, కార్పొరేట్ స్థాయి స్ట్రక్చర్ మీటింగ్‌లు నిర్వహిస్తారని, కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నూతన బొగ్గు గనులు రాకపోవడం, పాత గనులు మూసివేయడంతో సింగరేణి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. బొగ్గు గనులు ప్రైవేట్‌పరం చేయకుండా నామినేషన్ పద్ధతిపై సింగరేణికి కేటాయించాలని అన్నారు. ఎల్లో కార్డు, రెడ్ కార్డు విధానాన్ని రద్దు చేయాలని, కార్మికుల సమస్యలు, నియామకం, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, సహాయక కార్యదర్శి దాసరి తిరుపతిగౌడ్, గని ఫిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, కాసిపేట 1గని ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, నాయకులు సుభాష్ చంద్రబోస్, రాజ్‌కుమార్, కొండపల్లి నర్సయ్య, బొద్దుల వెంకటేష్, అంజయ్య, దేవులపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మోహన్

భీమారం: మండలంలోని తాళ్లగూడెం సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీరాంపూర్ సీఐ మోహన్ వివరాలు వెల్లడించారు. తాళ్లగూడెం సమీపంలోని నర్సరీ వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్సై రాములు, సిబ్బంది వెళ్లారు. మోటారు సైకిల్‌పై వచ్చిన దుర్గం సమత్(అంకూసాపూర్), సిడెం సాయికిరణ్(దాంపూర్), ఆలం మధూకర్(రెడ్డిపల్లి) గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో పట్టుకున్నారు. వారి వద్ద 70గ్రాముల గంజాయి, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గత సంవత్సరం నుంచి మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి గంజాయిని తక్కువ ధరకి కొనుగోలు చేసి మండలంలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని సీఐ తెలిపారు. వీరికి సుంకరిపల్లికి చెందిన దుర్గం సంజయ్, విజయ్ సహకరిస్తున్నారని తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్సై రాములు, సిబ్బంది మాచర్ల, ముత్తయ్య, పున్నం, చంద్రమోహన్, మహేష్, సంతోష్‌లను సీఐ అభినందించారు.

నేడు ఏరియా ఆస్పత్రి పరిరక్షణకు దీక్ష



మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా పరిరక్షణకు గురువారం ఆస్పత్రి ఎదుట ఒక రోజు దీక్ష చేయనున్నట్లు బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి పరిరక్షణ కమిటీ నాయకులు తెలిపారు. బుధవారం మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో నాయకులు మాట్లాడారు. ఆసుపత్రి పరిరక్షణ పోరాటాలకు కార్మికులు కలిసి రావాలని కోరారు. సింగరేణి యాజమాన్యం వ్యూహాత్మకంగా ఏరియా ఆసుపత్రిని నిర్వీర్యం చేయడానికి పావులు కదుపుతోందని విమర్శించారు. ఇప్పటికే పలు వార్డులను మూసివేస్తూ వస్తోందని, వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. ఒకరోజు దీక్షలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ నాయకులు సిద్దంశెట్టి రాజమొగిలి, రత్నం ఐలయ్య, ఎండి ఓజియార్, చాంద్‌పాషా, మణిరాంసింగ్, నీరటి రాజన్న, మహేందర్, గోగర్ల శంకర్, పోశమల్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు వింటున్న బెల్లంపల్లి ఆర్డీవో

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా కేకే ఓసీ ప్రభావిత ప్రాంతమైన దుబ్బగూడెం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ తెలిపారు. ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో బుధవారం ఏరియా జీఎం మనోహర్ ఆధ్వర్యంలో దుబ్బగూడెం ప్రజలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ హాజరై కేకే-ఓసీలో నష్టపోయిన దుబ్బగూడెం ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ గ్రామం ఆర్‌అండ్ ఆర్ సెంటర్ డెవలప్‌మెంట్, ఆర్‌అండ్‌ఆర్ డబ్బుల చెల్లింపు, ప్లాట్ల కేటాయింపు, రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యంపై జీఎంతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో మంచిర్యాల, బెల్లంపల్లి డీవైఈఈఆర్ అండ్ బీ సీహెచ్ రమేష్, హరీష్, ఎస్టేటు జీఎం రాజేశ్వరరెడ్డి, కేకే ఓసీ పీవో రమేష్ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బెల్లం, పటిక పట్టివేత



పట్టుబడిన నిందితులతో పోలీసులు

జైపూర్: మంచిర్యాల నుంచి కోటపల్లి మండలంలోని ఆల్గాంకు టాటా ఏస్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పది కాటన్ల బెల్లం, పది కిలోల పటికను బుధవారం రసూల్‌పల్లి వద్ద పట్టుకున్నట్లు జైపూర్ ఎస్సై శ్రీధర్ తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా పట్టుబడిన బెల్లం, పటికతో పాటు వాహన డ్రైవర్లు ఆత్రం వెంకటేష్, కుమ్మరి దినేష్‌లను అదుపులోకి తీసుకొని ఎక్సైజ్ ఎస్సై శంకర్‌కు అప్పగించినట్లు తెలిపారు.

ఏరియా ఆస్పత్రి ఎత్తివేత విరమించుకోవాలి



మాట్లాడుతున్న కామెర గట్టయ్య

పాతమంచిర్యాల: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి ఎత్తివేతను యాజమాన్యం విరమించుకోవాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబాల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఆస్పత్రిని మూసివేస్తే కార్మికులు, విశ్రాంత కార్మికులు, వారి కుటుంబాల వారు వైద్యం కోసం నానా అవస్థలు పడాల్సివస్తుందని తెలిపారు. ఆస్పత్రిలో డాక్టర్ల కొరత లేకుండా ప్రతీ కార్మికునికి మెరుగైన అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, జిల్లా నాయకులు దేవి సత్యం, జైపాల్‌సింగ్ మందమర్రి నాయకులు శ్రీహరి, గోళ్ల అంజన్న పాల్గొన్నారు.

మందమర్రి ఏరియాలో 75శాతం బొగ్గు ఉత్పత్తి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో జూలైలో సంస్థ నిర్దేశిత ఉత్పితిలో 75శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్లు ఏరియా జీఎం మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేకే-5 గనిలో 15,276టన్నులు, కాసిపేట గనిలో 13,016, కాసిపేట-2 గనిలో 11,174, శాంతిఖనిలో 3,427 టన్నులు, ఆర్కే ఓసీ 64,832 టన్నులు, కేకే ఓసీలో 79,492 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. వర్షాభావం వల్ల ఆర్కే ఓసీలో 33, కేకే-ఓసీలో 48 షిఫ్టులు పని నష్టం జరిగిందని పేర్కొన్నారు.

న్యాస్ పరీక్షకు సన్నద్ధం చేయాలి

మంచిర్యాలఅర్బన్: త్వరలో జరిగే న్యాస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేసే పీఎస్‌హెచ్‌ఎం, ఎస్జీటీ తెలుగు మీడియం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంఈవో పోచయ్య, నోడల్ అధికారి మాలవిదేవి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పద్మావతి, ఇంచార్జీ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సుధా పాల్గొన్నారు.

స్పందించి.. ఇంటికి చేర్చి

- కుమారుడు పట్టించుకోవడం లేదని ఇంటి నుంచి వెళ్లిపోయిన వృద్ధురాలు
- కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించిన పోలీసులు



జానకుబాయి

కౌటాల(సిర్పూర్): కుమారుడు పట్టించుకోవడం లేదని ఇంటి నుంచి వెళ్లిపోయి ఒంటరిగా తిరుగుతున్న వృద్ధురాలిని కౌటాల పోలీసులు కుటుంబం చెంతకు చేర్చారు. కౌటాల సీఐ సాదిక్‌పాషా తెలిపిన వివరాల ప్రకారం.. కౌటాల మండలం తాటిపల్లికి చెందిన వృద్ధురాలు రోహిణే జానకుబాయి కుమారుడు మారుతి వద్ద ఉంటుంది. పోషణను పట్టించుకోకపోవడంతోపాటు ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని కుమారుడు అనడంతో రెండు రోజుల క్రితం ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. సిర్పూర్(టి) రైల్వే స్టేషన్ సమీపంలో ఒంటరిగా తిరుగుతుండగా స్థానికులు ఫొటో తీసి సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. విషయం కౌటాల సీఐ సాదిక్‌పాషా దృష్టికి రావడంతో ఆయన స్పందించారు. వృద్ధురాలిని సిర్పూర్(టి) నుంచి తీసుకుని వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లిదండ్రులను పిల్లలే పోషించాలని, తల్లిని ఇబ్బందులకు గురి చేస్తే కేసు నమోదు చేస్తామని కుమారుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఉమ్మడి జిల్లాకు ఒకే ఒక్కడు!

- ఆ ఎంఈవో ఆదిలాబాద్‌కు కేటాయింపు
- 19 ఏళ్ల తర్వాత బదిలీ



సోమయ్య, ఎంఈవో

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి జిల్లాలో ఒకే ఒక్కడిగా ఉన్న ఎంఈవో సోమయ్య ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన 19 ఏళ్ల క్రితం ఎంఈవోగా పదోన్నతి పొంది కౌటాలలో విధులు నిర్వహిస్తున్నారు. కోర్టు కేసుల కారణంగా పదోన్నతి, బదిలీ పొందలేకపోయారు. 2005 తర్వాత ఉమ్మడి జిల్లాలో నలుగురు వరకు ఎంఈవోలు పనిచేశారు. వారు ఉద్యోగ విరమణ పొందడంతో ఈయన ఒకే ఒక్కడిగా కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. కోర్టు కేసు కారణంగా ఎంఈవో పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో ఆయన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనే 2005 నుంచి అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ప్రభుత్వం ఎంఈవోలకు అవకాశం కల్పించడంతో మల్టీజోన్-1లో ఐదుగురికి స్థానచలనం జరిగింది. ఇందులో కౌటాలలో పనిచేస్తున్న డి.సోమయ్య ఆదిలాబాద్‌అర్బన్‌కు బదిలీ అయ్యారు. గురువారం విధుల్లో చేరనున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఈయన 19 ఏళ్లుగా ఆసిఫాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. బదిలీపై రావడంతో జిల్లాలో ఒక రెగ్యులర్ ఎంఈవో పోస్టు భర్తీ అయింది.

'కొత్త గనుల ఏర్పాటుకు కృషి'



కార్మికులతో మాట్లాడుతున్న ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటుకు ఐఎన్టీయూసీ కృషి చేస్తుందని ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన ఆర్కే న్యూటెక్ గనిలో కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు యజమాన్యం దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. వచ్చే నెలలో లాభాల వాటా ఇప్పించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్కే న్యూటెక్ గనిలో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను గని మేనేజర్ స్వామి రాజుకు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు భీంరావు, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, తిరుపతిరెడ్డి, ల్యాగల శ్రీనివాస్, నాయకులు వెంగళ కుమారస్వామి, మహేందర్‌రెడ్డి, జక్కుల సాగర్, మహేందర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల అరెస్టు అప్రజాస్వామికం



మాట్లాడుతున్న మేకల దాసు

పాతమంచిర్యాల: సివిల్‌సప్లై హమాలీ కార్మికుల అరెస్టు అప్రజాస్వామికమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న కార్మికులను లక్సెట్టిపేట, తాండూరు, బెల్లంపల్లిలో పోలీసులు అరెస్టు చేశారని అన్నారు. ఏడు నెలలుగా వేతనాలు పెంచాలని కార్మికులు కోరుతున్నా పట్టించుకోకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి పౌలు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా నాయకులు దేవి పోచన్న, రాయమల్లు, తిరుపతి, సంతోష్ పాల్గొన్నారు.